

మెదక్ చర్చిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## శాంతికి ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : శాంతికి ప్రతీక మెదక్ చర్చి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

**గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల**



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో వీరు బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

### సింగరేణి సీఎండీ డిప్యూటేషన్ పొడిగింపు



హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం నాయక్ డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయననే పూర్తిస్థాయి సీఎండీగా నియమించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది.

### ప్రయాణికుల ఫిర్యాదులపై దృష్టి

**భద్రతా అంశాలపై రైల్వే అధికారుల సమీక్ష**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులు చేసే ఫిర్యాదుల పరిష్కారంపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. రైళ్లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు, భద్రత వంటి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) సమన్వయంతో నేరాలను తగ్గించే వ్యూహాలు, మెరుగైన రైల్వే భద్రత కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జోనల్ మేనేజర్లతో చర్చించారు. రానున్న రోజుల్లో రైల్వే భద్రత అంశాలపై కీలకంగా వ్యవహరించాలని ఆర్పీఎఫ్ అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జీఆర్పీ ఉన్నతాధికారుల 5వ అఖిల భారత సమావేశంలో ఈ అంశాలపైనా చర్చించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# సిరులవేణి.. సింగరేణి!

- 104 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- సంస్థను వెంటాడుతున్న సమస్యల సవాళ్లు



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీతే ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది. కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతులు పొందింది. రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.

### ఇతర ఖనిజ తవ్వకాలపైనా గురి

లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.

### సమస్యలు.. సవాళ్లు!

- సింగరేణిలో మొత్తం 40 గనులుంటే 22 భూగర్భ గణులే. వీటిలో ఉత్పాదక వ్యయం అధికం కావడంతో ఏటా రూ.3 వేలకోట్లు నష్టాలొస్తున్నాయి.
- కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు రావడం లేదు. ఈ కారణంతోనే నైనీ కోల్‌బ్లాక్ నాలుగేండ్లుగా ముందుకుసాగడం లేదు.
- ఉత్పత్తి నిరుడు 72 మిలియన్ టన్నులు ఉండగా, ఈ ఏడాది 74 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నది. ఆర్థిక సంవత్సరానికి ఇంకా 100 రోజులే గడువు ఉండగా, రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గును వెలికితీస్తేనే లక్ష్యం పూర్తవుతుంది.
- కార్మికుల గైర్హాజరు, పనిగంటలు సైతం బొగ్గు ఉత్పత్తి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 300 రోజుల్లో 75 రోజులు కూడా పనిచేయని కార్మికుల సంఖ్య 1,892గా తేలింది. పలువురు కార్మిక సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్నారు.
- యంత్రాల వినియోగంలోనూ చెప్పుకోదగిన పురోగతి లేదు. యంత్రాలను 18 గంటలు నడపాలని సంస్థ వర్గాలు పదే పదే ఆదేశాలిస్తున్నాయి.
- బొగ్గు గనుల్లో ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- కారుణ్య నియామకాల్లో అక్రమాలు సంస్థకు మాయనిమచ్చను తెచ్చిపెట్టాయి. ఈ అక్రమాలపై సీఐడీ విచారణ జరిపింది.
- వర్షాలు, వరదలు సైతం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్టుల్లో నీరు చేరుతున్నది. ఈ నీటి తొలగింపు పెద్ద సమస్యగా మారుతున్నది.



ఏటూరునాగారం వద్ద జాతీయ రహదారిపైకి చెట్లు రావడంతో కనిపించని రెయిలింగ్

## ఎన్‌హెచ్ యమడేంజర్

- ఇరువైపులా రోడ్డుపైకి వచ్చిన చెట్ల పొదలు
- కనిపించని రెయిలింగ్, ఫుట్‌పాత్
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం, డిసెంబర్ 22 : ములుగు జిల్లా ఏటూరునాగారం జాతీయ రహదారి ప్రమాదకరంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏటూరునాగారం మండల కేంద్రం నుంచి ముల్లకట్ట బ్రిడ్జి వరకు అనేక చోట్ల రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ముళ్ల పొదలు పెరిగి రోడ్డును కమ్మేశాయి. ఇంకా అనేక చోట్ల రోడ్డుకు ఇరువైపులా, వాగులపై ఉన్న బ్రిడ్జిలకు రెండు వైపులా ఏర్పాటు చేసిన రేలింగ్ విరిగి, ఫుట్‌పాత్‌లు కొట్టుకుపోయి ఇబ్బందికరంగా మారాయి. ఇసుక లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్లడం వల్ల రోడ్డుపై దారి పొడవునా గుంతలు పడి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. అయితే, రేలింగ్‌పై పెరిగిన రేగు చెట్ల పండ్ల కోసం ప్రయాణికులు రోడ్డు పక్కన ఆగినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం రేగుపండ్ల చెట్ల వద్ద ఆగేందుకు మండల కేంద్రానికి చెందిన తాడూరి రఘు తన బైక్‌ను స్లో చేసుకోగా, వెనుక నుంచి వాహనం వచ్చి ఢీ కొట్టింది. దీంతో భార్య, భర్తలు కిందపడి గాయపడ్డారు. ఇక రోడ్డు పూర్తిగా ప్రమాదకరంగా ఉన్నప్పటికీ జాతీయ రహదారి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక ద్విచక్రవాహనదారులు వెళ్తున్న క్రమంలో రేగు చెట్లు తగిలి ముల్లులు గుచ్చుకుంటున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ కూడా లేకపోవడంతో రేలింగ్ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జంపన్నవాగు బ్రిడ్జి ఫుట్‌పాత్ వద్ద దెబ్బతిన్న రోడ్డు

## మిర్చికోతలు షురూ..

వాజేడు, డిసెంబర్ 22 : మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో మిర్చి కోతలు ప్రారంభయ్యాయి. మార్కెట్‌లో ఎండు మిర్చికి మంచి డిమాండ్ ఉండడంతో మండల వ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున మిర్చి పంట సాగు చేశారు. ముందస్తుగా సాగు చేసిన చంద్రుపట్ల రైతుల పంట కోతకు వచ్చింది. దీంతో మిర్చి పంట కోసి కల్లాల్లో ఆరబోయడంతో ఎర్ర తివాచీలా కనిపిస్తున్నది.



కల్లంలో ఆరబోసిన పండు మిర్చి

### కౌన్సెలింగ్‌తో మార్పు



భార్యాభర్తలు చిన్నచిన్న విషయాలు, పంతాలతో గొడవలు పడుతున్నారు. ఎక్కువ సార్లు కౌన్సెలింగ్ చేసి కలుపుతున్నాం. కొందరు మ్యాట్రిమోనీ ద్వారా వ్యక్తిగత వివరాలు తెలుసుకోకుండా వివాహాలు చేసుకొని విడాకుల దాకా తెచ్చుకుంటున్నారు. మా స్టేషన్‌లో రోజుకు 5 నుంచి పది మంది మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. ఎక్కువ మంది ఇగోలకు పోయి విడాకులు కావాలని కోరుకుంటున్నారు. కుటుంబ సభ్యులు కూడా నచ్చజెప్పకుండా వెనకేసుకొస్తున్నారు. ఫ్యామిలీ మొత్తానికి కౌన్సెలింగ్ చేసి కలిపే ప్రయత్నం చేస్తున్నాం. వినకుంటే కోర్టు ద్వారా విడిపోవడానికి కేసులు నమోదు చేస్తున్నాం. ఎన్ఆర్ఐ కేసుల్లో లుక్ అవుట్ సర్క్యులర్‌తో భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేస్తున్నాం. ఇప్పటివరకు ఐదు కేసుల్లో దంపతులను కలిపాం. వారు తిరిగి విదేశాలకు కూడా వెళ్లారు.

– కే సూర్యప్రసాద్, ఇన్‌స్పెక్టర్, వరంగల్ అర్బన్ మహిళా పీఎస్

**దాంపత్య జీవితం హద్దులు దాటుతున్నది.** దంపతుల మధ్య గొడవలు పెరిగిపోతున్నాయి. కొందరు భార్యాభర్తలు కౌన్సెలింగ్‌తో కలిసిపోతుండగా.. మరికొందరు ఇగోతో విడిపోవడానికి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంకొందరు స్మార్ట్‌ఫోన్ రిలేషన్స్‌తో అనైతిక వ్యవహారాలు నడుపుతూ అడ్డంగా దొరికిపోయి పరువు తీసుకుంటున్నారు. ఇటువంటి ఫ్యామిలీ గొడవలతో బాధితులు వరంగల్ కమిషనరేట్ పరిధిలోని అర్బన్, రూరల్ మహిళా పోలీస్ స్టేషన్లకు క్యూ కడుతున్నారు. ఈ స్టేషన్ల పరిధిలో ఏడాదిలో 2,619 ఫిర్యాదులు రాగా, 293 కేసులు నమోదయ్యాయి. - సుబేదారి, డిసెంబర్ 22



# హద్దులు దాటుతున్న దాంపత్యం!

- భార్యాభర్తల మధ్య పెరుగుతున్న గొడవలు
- కొంపముంచుతున్న స్మార్ట్‌ఫోన్ రిలేషన్స్
- వరంగల్ అర్బన్, రూరల్ మహిళా పోలీస్ స్టేషన్లకు బాధితుల క్యూ
- వేధింపులు, అనుమానాలు, వివాహేతర సంబంధాలపైనే ఫిర్యాదులు
- ఏడాదిలో 2,619 పిటిషన్లు.. 293 కేసుల నమోదు

వరంగల్ రంగంపేటలోని అర్బన్, సుబేదారిలోని రూరల్ మహిళా పీఎస్‌లకు ఎక్కువగా అదనపు కట్నం, భార్యాభర్తల మధ్య అనుమానాలు, వివాహేతర సంబంధాల గొడవలు, స్మార్ట్‌ఫోన్ల మాటున జరుగుతున్న అనైతిక తతంగాలపై ఫిర్యాదులు వచ్చాయి. వీరిలో కొందరు పోలీసులు కౌన్సెలింగ్‌తో, ఇరువర్గాల పెద్దమనుషులు నచ్చజెప్పడంతో రాజీపడి కలిసిపోతున్నారు. మరికొందరు పంతానికి పోయి కోర్టు ద్వారా విడిపోవడానికి నిర్ణయించుకుంటున్నారు. వీరిలో ఎక్కువగా సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్ఆర్ఐలు, ఉన్నత విద్యా వంతులు ఉన్నారు. సోషల్‌మీడియా వేదికగా వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ ద్వారా ఇతర వ్యక్తులతో చాటింగ్‌లు, ఫోన్ కాల్స్‌తో ఒకరికొకరు అడ్డంగా దొరికిపోతున్నారు.

### కుటుంబ పెద్దల పట్టింపులేక..

ఒకప్పుడు ఇంటి పెద్దలు భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు వస్తే సర్ది చెప్పేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పెళ్లి కాగానే జాబ్, ఉపాధి రీత్యా భార్యాభర్తలు మాత్రమే కలిసి ఉంటున్నారు. వీరి మధ్య ఏవైనా గొడవలు వచ్చినపుడు సర్ది చెప్పడానికి పెద్ద వాళ్లు ముందుకురావడం లేదు. కొందరు భార్యాభర్తలు పిల్లలున్నా విడాకుల కోసం పంతం పడుతున్నారు. దీనికి ఎక్కువగా అనుమానం, వివాహేతర సంబంధాలు కారణాలుగా ఉన్నాయి.


### ఏడాదిలో 2,619 ఫిర్యాదులు

ఈ ఏడాదిలో వరంగల్ అర్బన్ మహిళా పీఎస్ (హనుమకొండ జిల్లా పరిధి)కు మహిళా బాధితుల నుంచి 1,511 ఫిర్యాదులు రాగా, చాలా వాటిల్లో భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని ఒకటి చేశారు. కౌన్సెలింగ్‌కు రాని వారిపై 203 కేసులు నమోదు చేశారు. వరంగల్, జనగామ జిల్లాల పరిధి నుంచి సుబేదారి రూరల్ మహిళా పీఎస్‌కు ఈ ఏడాదిలో 1,108 ఫిర్యాదులు రాగా, 90 కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ సువర్ణ తెలిపారు.

### మచ్చుకు కొన్ని ఘటనలు..

- హనుమకొండకు చెందిన ఓ ప్రభుత్వ అధికారి తన భార్య స్నానం చేసి పది నిమిషాల్లో బయటకు రాకపోతే కొడతాడు. తను చెప్పిన పనులే చేయాలి. లేదంటే వేధింపులు తప్పవు.
- కమిషనరేట్ పరిధిలోని ఓ తహసీల్దార్‌కు అదే శాఖలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగితో వివాహేతర సంబంధం ఏర్పడడంతో భార్య గుర్తించి ప్రశ్నించింది. దీంతో కొద్ది రోజులుగా ఆమెపై వేధింపులు పెరగడంతో భర్తపై ఫిర్యాదు చేసింది. వీరికి ఇద్దరు బీటెక్ చదువుతున్న పిల్లలున్నారు.
- హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వరంగల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అతడికి తన కూతురునిచ్చి పెళ్లి చేశాడు. ఏడాదిన్నరకు అల్లుడు హోమోసెక్స్ అని తేలింది. విడాకుల కోసం ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నాయి.
- నర్సంపేటకు చెందిన దంపతులు ఇద్దరు గొడవలతో కొద్ది రోజులు దూరంగా ఉండడంతో భర్త దగ్గరి బంధువైన అమ్మాయిని ఇటీవల రహస్యంగా రెండో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి ఫొటోలను స్టేటస్‌లో పెట్టుకోగా మొదటి భార్యకు తెలిసి ఫిర్యాదు చేసింది.
- వరంగల్ జిల్లాకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు భార్య, ఇద్దరు పిల్లలుండగానే ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధించడంతో కేసు పెట్టింది. దీంతో ఆర్ఎంపీ ఆ మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. కోర్టులో కేసు నడుస్తున్నది.

**పేదల పెద్దాస్పత్రిగా పేరున్న ఎంజీఎంలో నిఘా వ్యవస్థ నిద్రపోతున్నది. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన సెక్యూరిటీ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఫలితంగా ఆస్పత్రిలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. రోగులు, అటెండెంట్ల సెల్‌ఫోన్లతో పాటు దవాఖానకు సంబంధించిన యంత్రాలు, పరికరాలు చోరీకి గురవుతున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది పట్టింపులేనితనమే దీనికి కారణంగా కనిపిస్తున్నది. ఆస్పత్రిలో రాత్రివేళ ప్రత్యేక నిఘా ఉంచాల్సిన సిబ్బంది తూతూ మంత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.** - వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 22



చోరీకి గురైన బయోమెట్రిక్ యంత్రాలు (ఫైల్)

# నిద్రావస్థలో నిఘా వ్యవస్థ

- ఎంజీఎం దవాఖానలో పెరుగుతున్న దొంగతనాలు
- మాయమవుతున్న సెల్‌ఫోన్లు.. ఇతర పరికరాలు
- నిరంతర నిఘా పాటించని సెక్యూరిటీ సిబ్బంది
- చోరీలతో వణుకుతున్న రోగులు, అటెండెంట్లు

నిత్యం రోగులు, అటెండెంట్లతో రద్దీగా ఉండే ఎంజీఎం ఆస్పత్రిలో దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. సెక్యూరిటీ లోపాలు, నిఘా వ్యవస్థ నిర్లక్ష్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులకు సైతం మనశ్శాంతి కరువవుతున్నది. రాత్రి వేళ సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఎంజీఎంలో ఎక్కువవుతున్నది. కొన్ని సందర్భాల్లో రోగులు సైతం సెలైన్ బాటిల్‌ను చేతిలో పట్టుకొని ఆస్పత్రి బయటకు వెళ్లిన ఘటనలున్నాయి. రాత్రి పది దాటిందంటే చాలు ఎమర్జెన్సీ, ఏఎంసీ వార్డులు మినహాయించి ఏ ఒక్క వార్డులో కూడా సెక్యూరిటీ సిబ్బంది కనిపించరు. దీంతో అటెండెంట్ల వాహనాలు, రోగులు వినియోగిస్తున్న సెల్‌ఫోన్లు దొంగతనాలకు అంతులేకుండా పోతున్నది. రోగుల నిర్లక్ష్యంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని, వాటికి తాము బాధ్యులం కాదని, ఎవరి వస్తువులకు వారే బాధ్యత వహించాలంటూ సెక్యూరిటీ సిబ్బంది తప్పుకుంటున్నారు. రోగుల పరిస్థితి ఇలా ఉంటే ఆస్పత్రిలోని పలు యంత్రాలు, పరికరాలు సైతం చోరీకి గురవుతున్నాయి.

### పలు చోరీ ఘటనలు..

- గతంలో సర్జికల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొజెక్టర్, కంప్యూటర్లతో పాటు టీవీ దొంగతనానికి గురయ్యాయి. దీనిని సుమారు రెండున్నర నెలల తర్వాత గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మే 28న ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న నిబ్బుల రాజుకు అటెండెంట్‌గా ఉన్న అతడి భార్య భారతి మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారు పుస్తెలు తాడు దొంగతనం చేశారు.
- ఆగస్టు 9న ఎమర్జెన్సీ విభాగం పక్కనే ఉన్న పోలీస్ ఔట్ పోస్టు పక్కనే గుర్తు తెలియని శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న విషయాన్ని వైద్యం కోసం వచ్చిన వ్యక్తులు చెబితే తప్ప సెక్యూరిటీ సిబ్బంది గుర్తించలేకపోయారు.
- అక్టోబర్ 22న పారా మెడికల్, మినిస్టీరియల్ సిబ్బంది అటెండెన్స్ నమోదు చేసే బయోమెట్రిక్ యంత్రాలను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకుపోయాడు. ఈ విషయం తెల్లవారి విధుల్లోకి వచ్చిన ఉద్యోగులు చెబితేగాని సెక్యూరిటీ సంస్థ నిర్వాహకులు, సిబ్బందికి తెలియలేదు.
- డిసెంబర్ 18న ఓపీ సేవల కోసం వచ్చిన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామానికి చెందిన బాతోజు విమల (65)ను గుర్తు తెలియని వ్యక్తి రూ. వేయి ఇస్తే మెరుగైన వైద్యంతో పాటు మందులు ఇస్తానని నమ్మబలికి ఆమె నుంచి నగదు తీసుకొని పరారయ్యాడు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



తాడ్వాయి, డిసెంబర్ 22 : గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి చెందిన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి– మేడారం రహదారిలో జరిగింది. అటవీశాఖ రేంజ్ అధికారి నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి–మేడారం రహదారిలో గట్టమ్మ దేవత గుడి వద్ద ఆదివారం తెల్లవారుజామున దుప్పి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో దుప్పి అక్కడిక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి దుప్పి కళేబరాన్ని పరిశీలించారు. అతివేగంతో వాహనం ఢీకొనడంతో దుప్పి మృతి చెందిందని ఫారెస్ట్ రేంజ్ అధికారి నరేందర్ తెలిపారు. కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఖననం చేశారు. రాత్రి వేళల్లో అటవీ ప్రాంతం నుంచి వెళ్లే వాహనదారులు తక్కువ వేగంతో వెళ్లి వణ్యప్రాణులను కాపాడాలని ఆయన కోరారు.

## వసతి గృహంలో సమస్యల తిష్ట

- సరైన సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



ప్రమాదకరకంగా పాత నిర్మాణాలు

మొగుళ్లపల్లి, డిసెంబర్ 22 : వసతి గృహంతోపాటు చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకోగలుగుతారు. కానీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం సమస్యలకు నిలయంగా మారింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. వసతి గృహం నుంచి వచ్చే మురుగు నీరు బయటికి వెళ్లడానికి సరైన సదుపాయం లేక, పక్కనే ఉన్న పంట చేలలోకి వెళ్తున్నది. దీంతో తమ పంట చేన్లు నాశనమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మురుగు నీరు పంట చేన్లలో నిల్వ ఉండడం వల్ల హాస్టల్‌లో దుర్గంధం వెదజల్లి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. హాస్టల్ చుట్టూ పూర్తి స్థాయిలో ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు లోనికి స్వైరవిహారం చేస్తున్నాయి. అలాగే వసతి గృహంలో నూతన స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించారు కానీ, వాటిని ఆనుకొని ఉన్న పాత నిర్మాణాలను తొలగించకపోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. అలాగే హాస్టల్‌లో విద్యార్థుల రక్షణతోపాటు భోజన శాల, వంట గదుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కనిపించడం లేదు. దీంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. విద్యార్థులు చలికాలంలో చన్నీళ్లతో స్నానం చేయలేక పోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి సోలార్ హీటర్ ఏర్పాటు చేయించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.